# పుల్ల మామిడికాయ

తమ్ముడి కోసం వీధివేపే చూస్తూ కూర్చున్న నాకు విసుగొచ్చింది. గంటలు గడచిపోయాయి గానీ, తమ్ముడి జాడ లేదు. తమ్ముడిని తీసుకొస్తానని వెళ్ళిన ఆయన కూడా ఇంకా కనబడటం లేదు.

పడమటి గదిలో జీవన్మరణాలతో పోట్లాడుతోంది, జీవితానికి వెలుగు నిచ్చిన పగలు, ముందుకొస్తున్న మరణ వీచికల చీకటి పొరలను వెనక్కు తోసి బలవంతంగా అప్పుడప్పుడు సూర్యనేత్రాలను విప్పుతూ తన వారసుడు చంద్రుని కొరకు ఎదురు చూస్తోంది.

లోనికి వెళ్ళాను. లోన గదిలో పడి ఉంది అమ్మ. కొన ఊపిరితో ఉన్న పగటి వెలుగు చుక్కలు అమ్మ మొహం మీద పడుతున్నాయి.

చూపు నిలవనప్పటికీ, బలవంతంగా కళ్ళు తెరచి చూసింది అమ్మ. ఆ చూపులు వెదికేది తమ్ముడినేనని నాకు తెలుసు. కానీ వాడెక్కడ ఉన్నాడో !

గట్టిగా నిట్టూర్చాను.

అస్తవ్యస్తంగా ఉందా గది. దుమ్ము ధూళి చేరి, ఒకప్పుడు అందంగా ఉన్న ఆగది కళావిహీనంగా ఉంది. పూలసజ్జలో అమర్చిన పూలు వాడిపోయి తలలు వాలుస్తున్నాయి. గోడ మీద తగిలించిన అందమైన కేలండర్ తనకి ఆ గదికీ ఉండే సంబంధాన్ని తెంచేసి నేలమీదకు రాలటానికి సిద్ధంగా గాలికి ఊగిసలాడుతోంది.

మంచంమీద అమ్మ తల దగ్గరే కూర్చొని ఉంది మా పదేళ్ళ పాప.

నీరసంగా రేగిపోయిన జుత్తుతో కనిపించిన పాపని చూస్తుంటే నాకు బాధ వేసింది.

నాలుగు రోజుల నుంచి అనుకుంటున్నా, దానికి నూనె రాసి జడవెయ్యాలని కాని కుదరలేదు. దాని ఆలనా పాలనా చూడటం ఈ మధ్య అస్సలు కుదరటం లేదు. అమ్మ శుశ్రూషలతోనే రోజంతా గడచిపోతుంటే........

కథా నిలయం
4657
శ్రీకాకుళం

మెల్లిగా పాప దగ్గరకి వెళ్ళి కూర్చొని, ఆప్యాయంగా తల నిమిరాను. ఈ నెలరోజుల్లో ఎంత చిక్కి పోయింది, పాప!

పాప ఏమిటీ? నేను కూడా బాగా చిక్కి పోయానట! కంటి కింద బాగా నలుపు చేరి పోయింది. నిద్రా విహీనమైన కళ్ళు ఎర్రగా మందారాలలా ఉన్నాయి.

ఆయన అది గమనించకపోలేదు. "మీ అమ్మకు సేవలు చేయవద్దని నేను అనను గానీ మీ అమ్మ ఆరోగ్యం కుదుట పడేలోగా నువ్వు మంచం ఎక్కేలాగున్నావు" ఆయన అన్నారు.

నిజమే! నా ఆరోగ్యం కుంటుపడుతోందని తెలుస్తోంది. కానీ నేను చూడకపోతే అమ్మని ఎవరు చూస్తారు? అమ్మకి ఉన్నది నేను, తమ్ముడే.

"మామయ్య వస్తాడా అమ్మా?" పాప ఆత్రుతగా అడిగింది. నేనేమీ అనలేదు. పాప ఆత్రుత మామయ్య రాక గురించి కాదని, మామయ్యతో పాటు వచ్చే తన ఈడు పాప గురించేనని నాకు తెలుసు.

పసి వయస్సులో ఉండే ఆప్యాయత, అనురాగాలు చూసి నాకు నవ్వాలో, ఏడవాలో తెలీయలేదు.

చిన్నప్పుడు తమ్ముడు కూడా చాలా ఆప్యాయంగానే ఉండేవాడు. నా పెళ్ళి అయిన తర్వాత కూడా రోజూ వచ్చి చూసి వెళ్ళేవాడు. అప్పుడు వాడు ఇంత దగ్గరలో ఉండేవాడు కాదు. కానీ, ఇప్పుడు.........

పూర్తిగా నల్లపూస అయిపోయాడు.

వాడు వచ్చి రోగగ్రస్తురాలైన తల్లిని చూసి రెండు వారాలై పోయాయి. రమ్మని ఫోను చెయ్యని రోజులేదు.

నాకు బాధ వేసింది.

పెళ్లయ్యాక వాడు పూర్తిగా మారి పోయాడు.

గట్టిగా మూలుగుతో ి అమ్మ, ఏదో చెప్పాలని ప్రయత్నిస్తోంది. కానీ మాట రావటం లేదు.

లేచి నాలుగు నీటి చుక్కలు అమ్మ నోట్లో పోశాను.

పగటి వెలుగు తగ్గి పోయింది. గదంతా చీకటిగా ఉంది. లైటు వేశాను. ఫ్యూజు కాక నానికి సిద్ధంగా ఉన్న ట్యూబ్‌లైట్ సరిగ్గా వెలగటం లేదు. మిణుకు మిణుకుమని వెలిగి ఆరుతున్న వెలుగులో చూశాను. గుండె జారి పోయింది.

పాప మెడలో గొలుసు లేదు.

అమ్మది, ఐదు తులాల పలకసరులు వేసికొని తిరుగుతూ ఉండేది పాప. అమ్మమ్మ గొలుసని ముచ్చట పడుతుంటే నేనే, అమ్మనడిగి దాని మెడలో వేశాను.

"ఏమైంది అమ్మమ్మ గొలుసు?" కంగారుగా అడిగేను.

"అమ్మమ్మ తీసేసుకొంది"

"అమ్మమ్మ తీసుకోవటం ఏమిటి ?" నేను నమ్మలేదు.

"ఇమ్మని అడిగింది అమ్మమ్మ. నేను ఇచ్చాను. ఇందాక నువ్వు మామయ్య కోసం నాన్నని పంపావు కదా, అప్పుడు తీసుకొంది."

నాకు నమ్మబుద్ధి కాలేదు. మాట పడిపోయిన అమ్మ పలకసరులు అడిగి తీసుకోవటం ఏమిటి ?

పరీక్షగా చూశాను. అమ్మ మెడలో గొలుసు లేదు.

"అమ్మమ్మ తీసుకొందంటావేమిటే మెడలో గొలుసు లేందే ?"

"తీసుకొంది. అమ్మా ! చూడు చేతిలో ఉంది"

అమ్మ కుడి చెయ్యి పిడికిలి బిగించి ఉంది. అందులోగానీ, ఉందా గొలుసు!

మెల్లగా పిడికిలి విప్పటానికి ప్రయత్నించాను.

ఫోను మ్రోగింది. అవతల నుంచి మాట్లాడేది ఆయనే, తమ్ముడి ఇల్లు తాళం వేసి ఉందట ! బహుశః వాడు అత్తవారింటికి వెళ్ళి ఉంటాడేమోనని అక్కడకు వెళుతున్నారట , ఆయన.

నాకు చాలా కోపం వచ్చింది. వీడెప్పుడూ ఇంతే. చావుకి కబురు చేస్తే తద్దినానికి వచ్చే రకం!

పదిహేను రోజులనుంచీ వాడు మొహం చూపించలేదు. అమ్మ ఆరోగ్యం నిముష నిముషానికి దిగజారి పోతోంది, ఫోను చేస్తూనే ఉన్నాను.

"వాడు రాలేదని విసుక్కుంటే ఎలాగే విశాలా" అమ్మని చూడటానికి రాని తమ్ముడిని విసుక్కొంటే విని ఊరుకోలేదు అమ్మ "రావాలని ఉన్నా కుదురొద్దూ? ఇద్దరూ ఉద్యోగస్థులు కదా? ఉండేది ఒక్క ఆదివారం, బోలెడు పనులు"

అందరికి ఉండేది ఆ ఒక్క ఆదివారమేనని, తన కొడుకు, కోడలే కాదు, కూతురు కూడా ఉత్యోగస్థురాలేనని మరచిపోతుంది అమ్మ. అమ్మ తమ్ముడి దగ్గర ఉన్నప్పుడు ఏ ఒక్క ఆదివారమైనా అమ్మని చూడటానికి వెళ్ళలేకపోతే ఎంత నిష్ఠూరంగా మాట్లాడేదో!

గట్టిగా దగ్గి, దగ్గి ఒకవైపుకి తిరిగి పడుకొంది అమ్మ. కిటికీ దగ్గరకు వచ్చి మరోసారి చూశాను, తమ్ముడు వస్తున్నాడేమోనని, వాడి జాడలేదు.

రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. తోటలో ప్రొద్దుట విరిసిన మందారాలు ముడుచుకు పోయి రాలి పోవటానికి సిద్ధంగా ఉన్నాయి.

'ఏ నిముషమైనా కళ్ళు మూసేయవచ్చు అమ్మ. వాడు తొందరగా వస్తే బాగుండును' అనుకొన్నాను.

అమ్మ కాలు విరిగినప్పటి సంఘటన గుర్తుకొచ్చింది.

రెండు రోజులుండిపోదామని వచ్చిన అమ్మ స్నానాల గదిలో పడిపోయింది. విరిగి పోయిన కాలికి వైద్యం చేయించి, ఇంటికి వచ్చాక ఆయనని తమ్ముడి దగ్గరకు పంపాను. పాపం ఓ పదిసార్లయినా తిరిగి ఉంటారు, తమ్ముడి ఇంటికి ఆఫీసుకి, ఎంతకూ దొరక్క పోవటంతో తమ్ముడి ఇంట్లో చీటీ వ్రాసి పడేసి వచ్చారు.

పది రోజులు పోయాకా వచ్చేరు తమ్ముడు మరదలు, తిరుపతి ప్రసాదం తీసుకొని.

"అయ్యయ్యో, నాకు తెలియలేదే అక్కా" అంతా విని వాడు అన్నాడు.

"కబురు చేస్తే ప్రయాణం మానుకొనే వాడిని కదా?"

"అవును వదిన గారు! తర్వాత వెళ్ళే వాళ్ళం కదా?" మరదలు శ్రుతి కలిపింది.

నాకు ఒళ్లు మండిపోయింది. పళ్లు కొరుక్కున్నాను. కాలు ఫ్రాక్చరయ్యాక రెండు రోజుల తరువాత తమ్ముడి పక్క ఇంట్లో ఉన్న ఆవిడ అమ్మని చూడటానికి వచ్చారు. ఆ రోజు తమ్ముడు, మరదలు ఊరిలోనే ఉన్నారని ఆవిడ చెప్పారు.

"అమ్మ మీ ఇంటికి వచ్చేస్తానంటోందిరా" కావాలనే అన్నాను. తమ్ముడు, మరదలు, ఒకరి మొహం ఒకరు చూసుకొన్నారు. ఎవరూ, ఏమీ మాట్లాడలేదు.

"వాడిని ఎందుకే ఇబ్బంది పెడతావు" అమ్మ అంది. " నా కిక్కిడ బాగానే ఉందిరా అబ్బాయ్"

నెల రోజుల తర్వాత కాలు నయమయింది. అమ్మ మామూలుగా, తిరగటం, పనులుచేసుకోవటం ప్రారంభించింది. వెంటనే కొడికింటికి బయలుదేరిన అమ్మని నాకు సహాయంగా పది రోజులుండమని అడిగేరు, ఆయన.

"నాకెలా కుదురుతుంది నాయానా!" అమ్మ అంది అవతల వాడు ఇల్లు కట్టుకుంటున్నాడు. తిరగలేక పోతున్నాడు. కోడలేమో ఆఫీసు పనులు ఇంటి పనులతో సతమతమై పోతోంది. పైగా చంటి పిల్ల ఒకటి"

ఆయన మొహం చిన్నబోయింది.

తల్లికి సేవలు చేయడమే కూతుళ్ల వంతని, తల్లిచేత సేవలు చేయించుకోవటం కొడుకుల వంతని ఆయనకి తెలియదు కాబోలు !

ఆటో ఆగిన శబ్దం వినిపించింది. ఆయన ఆటో దిగారు. వెనుక తమ్ముడు, మరదలు, వాళ్ల పాప.

"అమ్మకింత సుస్తీ చేసిందని, సీరియస్‌గా ఉందనీ నాకు తెలియదే అక్కా" ఇంటిలోనికి వస్తూనే మొదలెట్టాడు, తమ్ముడు "ఈ మధ్య రోజూ ఇంటికి వచ్చే సరికి రాత్రి పది అయిపోతోంది. నిజంగా మొన్న ఆదివారం రావాలనే అనుకొన్నాము.

కానీ....."

కానీ, ఏముంది ? కొంప మునిగిపోయే పని వచ్చి పడిందని చెప్తాడు. అది వాడికి అలవాటే.

నాకు అసహ్యం వేసింది.

"లోపలకి పదరా. అమ్మకి చాలా సీరియస్‌గా ఉంది."

"తమ్ముడు వచ్చాడమ్మా" నేను మంచం దగ్గరకి వెళ్ళి అమ్మ చెవిలో అన్నాను.

అమ్మ బలవంతంగా కళ్ళు విప్పింది. అందరినీ ఒకసారి చూసింది. తమ్ముడి కూతురిని దగ్గరకు రమ్మని సైగ చేసింది.

మెల్లగా గుప్పెట తెరచింది. గుప్పెటలో దాచి ఉంచిన పలకసరులు తమ్ముడి కూతురి మెడలో వేసి తల వాల్చేసింది.

పగలు చచ్చిపోయింది. పగటి శవం దగ్గర నెల రాజనే ప్రమిద వెలిగింది.

తమ్ముడి పాప మెడలో ఉన్న అమ్మ పలకసరులవైపే, ఆశగా చూస్తూ నించున్న మా పాపని చూస్తుంటే జాలి వేసింది నాకు.

చనిపోతే ఒంటిమీది బంగారం కూతురికి చెందుతుందనే బాధతో బ్రతికి ఉండగానే తెలివిగా, పలకసరులు కొడుకు కూతురికి అప్పగించింది మా అమ్మ.

కొడుకు పిల్లల బాగోగులకన్నా, కూతురి పిల్లల బాగోగుల గురించే తల్లులు ఎక్కువ ఆలోచిస్తుంటారని చెప్తూ ఉంటారు. గానీ మా అమ్మ ఆ కోవకు చెందిన వ్యక్తి కాదేమోనని అనిపించింది.

అయినా , టెంక దగ్గరకెళ్లే కొద్దే కదా, తెలిసేది మామిడికాయ పులుపు!

(ఆంధ్రప్రభ వారపత్రిక 14-12-93)